క్లుప్తంగా

అర్హులందరికీ రేషన్ కార్డులివ్వండి

సికింద్రాబాద్: అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సికింద్రాబాద్ అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారిని బీఎస్ సరస్వతితో కార్పొరేటర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో కొందరికి మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చారని, మిగతా దరఖాస్తుదారులు రేషన్ కార్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రేషన్ దుకాణాల డీలర్లు సరుకులు సకాలంలో పంపిణీ చేయడం లేదని, నిర్ణీత సమయాల్లో సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ జాయింట్ కన్వీనర్ల నియామకం

కంటోన్మెంట్: సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. అందులో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన సామల సత్తిరెడ్డిని మల్కాజ్‌గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్‌గా, సతీష్‌కుమార్‌ను కంటోన్మెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్‌గా నియమించినట్లు ఆయన తెలిపారు. స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేసేందుకు గాను ఒకటో వార్డుకు భట్టు శంకర్, మూడో వార్డుకు అరుణ్, నాలుగో వార్డుకు రాజమల్లేశ్‌ను అదనపు ఇన్‌చార్జ్‌లుగా నియమించినట్లు రామకృష్ణ వెల్లడించారు. ఆయా వార్డుల అధ్యక్షులు ఉద్యోగ, వ్యాపార బాధ్యతల్లో భాగంగా పార్టీకి పూర్తి స్థాయి సమయం కేటాయించలేక పోతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

'బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి'

చిలకలగూడ: కల్వకుంట్ల కుటుంబ సభ్యుల కబంధహస్తాల నుంచి తెలంగాణను విముక్తి చేసే వరకూ అలుపెరుగని పోరాటం చేస్తామని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ భవానీనగర్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ నరేష్ నేతృత్వంలో శుక్రవారం ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. సారంగపాణి మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలు, అబద్ధాల పునాదులపై ఏర్పడిన బీఆర్‌ఎస్‌కు సరైన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు.

శైవాలయాలకు శివరాత్రి కళ

మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమైన ఆలయాలు
- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు
- రాత్రిపూట జాగరణ చేసే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న నిర్వాహకులు

సనత్‌నగర్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని సనత్‌నగర్ నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు అందంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాల కాంతులతో శోభయమానంగా కనిపిస్తున్నాయి. శనివారం వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు ఆలయాల్లో వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాత్రి జాగరణ చేసే భక్తుల కోసం పలు ఆలయాల్లో భజనలు, గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించనున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

- సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రుద్రాభిషేకాలు, సాయంత్రం 6.30 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం, 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 10 గంటలకు భక్తి సంగీత కార్యక్రమం (జాగరణ), 12 గంటలకు లింగోద్భవ కాలం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మరుసటి రోజు 19న ఉదయం 9 గంటల నుంచి నానాఫల రసాభిషేకం, సాయంత్రం 7.30 గంటలకు శివపార్వతుల ఊయల సేవ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.
- అమీర్‌పేట్ హనుమాన్ దేవస్థానంలోని రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో తెల్లవారుజామున 4.30 నుంచి సర్వదర్శనం, అభిషేకాలు మొదలవుతాయని ఆలయ అధికారులు తెలిపారు. సాయంత్రం 4 నుంచి ప్రత్యేక దర్శనం (లింగ స్పర్శదర్శనం), రాత్రి 10 నుంచి 12 గంటల వరకు శివపార్వతుల కల్యాణం, అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక(లింగోద్భవ) అభిషేకం ఉంటుందన్నారు.
- బల్కంపేట్ వీరహనుమాన్ షిరిడీ సాయిబాబా దేవాలయంలో ఉదయం 5.30 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.
- బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి శివరాత్రి మహోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.
- బేగంపేట అల్లంతోటబావిలోని సీతారామలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు.


శివరాత్రి వేడుకలకు ముస్తాబైన సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం


ప్రకాశ్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం


సీతాఫల్‌మండి రామలింగేశ్వర ఆలయంలోని శివలింగం

సీతాఫల్‌మండిలో..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతంలో ఏకైక శివాలయంగా ఉన్న సీతాఫల్‌మండి రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు, కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసులు పర్యవేక్షించారు. నుడు ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, హోమం తదితర ప్రత్యేక కైంకర్యాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 7.05 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలాభిషేకం కార్యక్రమాలు ఉంటాయి.

మహనీయుల స్ఫూర్తితో ముందుకెళ్లాలి


విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి తలసాని

పద్మారావునగర్: మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ నవ సమాజం దిశగా ముందుకు సాగాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డు సమీపంలోని అంబేడ్కర్ నగర్‌లో బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ దళితుల అభ్యున్నతి, వికాసానికి కృషి చేశారని కొనియాడారు. మహనీయుల జీవిత చరిత్రలు చదివి అనేక విషయాలు తెలుసుకోవాలని సూచించారు.

'మంత్రి ప్రోద్బలంతోనే ఇష్టానుసారంగా పనులు'


డివైడర్ పనులను పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

సనత్‌నగర్: ఎర్రగడ్డ-సనత్‌నగర్ ప్రధాన రహదారిలో నిర్దిష్టమైన అలైన్‌మెంట్ లేకుండా సాగుతున్న పనులను వెంటనే నిలిపివేయాలంటూ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి ప్రోద్బలంతోనే అలైన్‌మెంట్‌ను ఇష్టానుసారంగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్ సరళతో కలిసి డివైడర్ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని శుక్రవారం శశిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ లేకుండా రహదారిని అడ్డదిడ్డంగా తవ్వుతూ డివైడర్ పనులు చేయడం వెనుక బీఆర్‌ఎస్ నేతల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఫతేనగర్ బ్రిడ్జి ల్యాండింగ్ వరకూ డివైడర్ ఏర్పాటు చేస్తున్నారని, దీంతో సనత్‌నగర్ బస్టాండ్, ఫతేనగర్ బ్రిడ్జి కిందకు వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే పనులు నిలిపివేసి, సరైన అలైన్‌మెంట్ రూపొందించాలని డిమాండ్ చేశారు. సనత్‌నగర్ కాలనీవాసులు, ట్రాఫిక్ నిపుణులు, విపక్ష పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని ఆయన సూచించారు.

కంటోన్మెంట్‌లో సమ్మర్ క్యాంపులు

కంటోన్మెంట్: బోర్డు ఆధ్వర్యంలో క్రీడాకారుల కోసం సమ్మర్ క్యాంప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు బోర్డు సభ్యుడు జే.రామకృష్ణ వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన పలువురు స్థానిక క్రీడాకారులతో కలిసి సీఈవో మధుకర్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్‌లో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఖేలో ఇండియా'లో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కీడా మైదానాలను అభివృద్ధి చేస్తామన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

అమీర్‌పేట: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న జంగా వెంకటేశ్వర్‌రావు సనత్‌నగర్ జెక్ కాలనీ స్ట్రీట్ నెంబర్-5లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 7న వెంకటేశ్వర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి అమలాపురం వెళ్లాడు. 14న ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లు గమనించిన స్థానికులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. 16న ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉన్న 3.5 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులు కనిపించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీచర్స్ కాలనీ సమీపంలోని ఖాళీ స్థలంలో మంటలు

అడ్డగుట్ట: తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో టీచర్స్ కాలనీలోని ఖాళీ ప్రదేశంలో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న తుకారాంగేట్ పోలీసులు, ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఖాళీ ప్రదేశంలో ఉన్న చెత్తలో ఎవరో సిగరెట్ వేయడంతో నిప్పంటుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని సీఐ ఎల్లప్ప తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్

సికింద్రాబాద్: రైలు ప్రయాణికులను దోపిడీ చేస్తున్న వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి 105 గ్రాముల బంగారు, 20 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీను తెలిపిన వివరాల మేరకు.. ప్లాట్‌ఫాం 1పై అనుమానాస్పదంగా ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. పోలీసులు విచారించగా ఒడిశాకు చెందిన బటకృష్ణ బరాల్ (35)గా తెలిసింది. రైల్వే ప్రయాణికుల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

అమీర్‌పేట: యువతిని వేధిస్తున్న వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికంగా ఓ హాస్టల్‌లో ఉంటున్న 25 ఏళ్ల యువతి ప్రైవేట్ సంస్థలో పనిచేస్తుంది. యువతి సాఫ్ట్‌వేర్ శిక్షణ తీసుకుంటున్న సమయంలో హరిబాబు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అతడు తరుచూ ఫోన్ చేసి తన కోర్కె తీర్చాలని, లేని పక్షంలో నీతో పాటు కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. హరిబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం.. కేసు నమోదు

అమీర్‌పేట: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భం దాల్చాక పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల మేరకు.. వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన శాలిని గోడి బోరబండ రాజ్‌నగర్‌లో ఉంటూ జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తుంది. 2021లో గుంటూరులో ఉండగా రోహిత్‌ఖాన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. యువతి నగరానికి రావడంతో రోహిత్‌ఖాన్ సైతం ఇక్కడకు వచ్చాడు. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో అతడి మాటలు నమ్మింది. అయితే ఆమె గర్భం దాల్చిన విషయం తెలియగానే ముఖం చాటేశాడు. ఫోన్ చేసినా తీయకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

బన్సీలాల్‌పేట్‌లో ఉన్నతాధికారుల బృందం పర్యటన

బన్సీలాల్‌పేట్: ఎన్నో ఏళ్ల క్రితం స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని నివసిస్తున్న పేదల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్య పరిష్కారం కోసం శుక్రవారం ఉన్నతాధికారుల బృందం బన్సీలాల్‌పేట్, జీరా, సామప్పమఠం బస్తీల్లో పర్యటించింది. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రి వర్గ ఉప సంఘంలోని ఉన్నతాధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు తెలుసుకున్నారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు ఇక్కడ పర్యటించి స్థానికులతో మాట్లాడి ఇళ్లకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

సినీ డైరెక్టర్ అదృశ్యం

అమీర్‌పేట: ఆస్పత్రికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో సినీ డైరెక్టర్ అదృశ్యమైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ స్వప్నారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌నగర్ బీకేగూడ పార్కు సమీపంలోని దాసారం బస్తీలో నివసించే మోహన్‌రెడ్డి(42) సినీ డైరెక్టర్‌గా పనిచేయడంతో పాటు కొన్ని సినిమాలకు రైటర్‌గా పని చేశాడు. అనారోగ్య సమస్యలు ఉండడంతో గురువారం సాయంత్రం కుటుంబ సభ్యులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా కనిపించకుండా పోయాడు. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోహన్‌రెడ్డి మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు.

విజయ డెయిరీని విజయపథంలో నడిపించాలి

లాలాపేట: విజయ డెయిరీ పేరులో ఉన్న విజయాన్ని ఆచరణలో చూపించేందుకు కృషి చేయాలని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ సోమ భరత్‌కుమార్ సూచించారు. సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఫెడరేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, కేలండర్‌ను శుక్రవారం లాలాపేటలోని విజయ భవన్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తెంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగులు పని చేయాలని సూచించారు. సుమారు 2 లక్షల పాడి పశువులను రైతులతో కొనుగోలు చేయించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. త్వరలో రెండు వేల విజయ పార్లర్‌లను ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈ.మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కె.అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులు కవిత, శ్రావణ్‌కుమార్, కామేష్, మల్లికార్జున్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు



ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత ,మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కవిత

అమీర్‌పేట: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయానికి విచ్చేసిన ఆమెకు నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో రాజశ్యామల పూజ నిర్వహించి అమ్మవారికి బంగారు ఆభరణాలు సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం జన్మదినాన్ని పురష్కరించుకొని ఆయన ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. బల్కంపేట అమ్మవారి ఆలయం రోజురోజుకి అభివృద్ధి చెందుతుందని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ, బీఆర్‌ఎస్ నాయకులు హనుమంత్‌రావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


బెలూన్లు ఎగురవేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల పరిధిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి సందడి చేశారు. అనంతరం పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం


సికింద్రాబాద్ గణపతి ఆలయంలో పూజల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత తదితరులు


మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి సీఎం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బోర్డు మాజీ సభ్యులు